సాక్షి నంద్యాల

సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023




సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఆదివారం 1,1760 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 0.688 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కేసీ కాల్వకు 1,058 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



అడవి తల్లికి స్వచ్ఛ హారం

ప్లాస్టిక్ మహమ్మారి నుంచి నల్లమలను కాపాడేందుకు అటవీ అధికారులు చేపట్టిన ప్రయత్నం ఫలిస్తోంది. అటవీ ప్రాంతాల్లోని రహదారుల వెంబడి, క్షేత్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

మల్లన్నకు బ్యాటరీ కారు బహూకరణ



వాహన పూజలనంతరం మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే శిల్పా, ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు కనకదుర్గ

శ్రీశైలం: శ్రీశైల మల్లన్న దర్శనానికి వచ్చే వృద్ధులు, వికలాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వారి సౌకర్యార్థం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు డాక్టర్ కనకదుర్గ ఆదివారం బ్యాటరీ కారును బహూకరించారు. రూ. ఆరు లక్షల విలువైన వాహనానికి పూజలు అనంతరం మంత్రి ఆదిమూలపు సురేష్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు చక్రపాణిరెడ్డి సమక్షంలో ఈఓ లవన్నకు అందజేశారు.

నేడు స్పందన కార్యక్రమం

నంద్యాల: స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతథంగా కార్యక్రమం ఉటుందన్నారు.

అన్నప్రసాద పథకానికి విరాళాలు



తిరువూరుకు చెందిన దాతకు విరాళాల బాండును అందజేస్తున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తిరువూరుకు చెందిన నల్ల వెంకట సత్యనారాయణరావు రూ.1,00,116 లు, కొట్టగూడెంకు చెందిన జి.బ్రహ్మాజీ రావు 1,00,000 విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో మొదటి రోజున 111 కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షలకు జనరల్ విద్యార్థులు 3,673 మందికిగాను 3,575 మంది, ఒకేషనల్ విద్యార్థులు 516 మందికిగాను 499 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు జనరల్ విద్యార్థులు 3,189 మందికి 3,109 మంది, ఒకేషనల్ విద్యార్థులు 378 మందికిగాను 359 మంది హాజరయ్యారు. జిల్లాలో పలు కేంద్రాలను ఆర్ఐఓ గురవయ్యశెట్టి తనిఖీ చేశారు.

1 నుంచి గాలికుంటు టీకాల కార్యక్రమం

కర్నూలు(అగ్రికల్చర్): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని వచ్చే నెల 1 నుంచి చేపట్టడానికి పశుసంవర్ధక శాఖ ఏర్పాట్లు చేసింది. కర్నూలు జిల్లాకు 3,25,800 డోసులు, నంద్యాల జిల్లాకు 3,72,550 డోసుల వ్యాక్సిన్ సరఫరా అయ్యింది. ఉమ్మడి జిల్లాలో 6,98,350 తెల్ల, నల్ల జాతి పశువులకు గాలికుంటు టీకాలు వేయాల్సి ఉందని జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు తెలిపారు.



కోవిడ్ తర్వాత మా ఆలోచన మారింది. లైఫ్ చాలా చిన్నది అని తెలిసింది. ఇప్పటి లైఫ్‌స్టైల్‌లో ఒత్తిడితో ఎప్పుడు ఉంటామో, లేదో తెలీదు. అందుకే ఉన్న లైఫ్‌ను హ్యాపీగా గడపాలి. రెండేళ్లుగా ఎక్కువగా ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో ట్రిప్స్ వెళుతున్నాం. ఇంతకు ముందు అబ్బాయిలు బ్యాచ్‌లుగా వెళ్లేవారు. ఇప్పుడు అమ్మాయిలుగా మేం వెళుతున్నాం. బయటికి వెళ్లడం వల్ల ఫ్యామిలీ రిలేషన్స్, ఫ్రెండ్‌షిప్ మరింత బలపడతాయి. ఇటీవల ఊటీ, కంచి, బెంగళూరు, హైదరాబాద్‌లోని రిసార్ట్స్‌తో పాటు చాలా ప్రాంతాలకు వెళ్లాం. ఉన్న లైఫ్‌ను సంతోషంగా గడపడమే తొలి ప్రాధాన్యత. ఆ తర్వాతే అన్నీ!!

– పద్మజ బైసాని



హ్యాపీగా..జాలీగా: స్నేహితులతో సరదాగా..

ఉన్నది ఒకటే జిందగీ!

- 'హ్యాపీ లివింగ్'కు ప్రాధాన్యత
- కోవిడ్ తర్వాత మారిన ప్రజల జీవన విధానం
- ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో ఉత్సాహంగా గడుపుతున్న వైనం
- ఆనందంగా వీకెండ్స్, హాలిడే ట్రిప్స్

సాక్షిప్రతినిధి కర్నూలు: జీవితం చాలా విలువైంది. పూట గడిస్తే చాలు అనుకునేవారు కొందరుంటే.. విలాసవంతమైన జీవితం గడపాలని ఇంకొందరు భావిస్తుంటారు. అయితే కోవిడ్ తర్వాత పేద, ధనిక అని తేడా లేకుండా అందరి ఆలోచన తీరులోనూ, జీవన విధానంలోనూ మార్పు వచ్చింది. గతంలో కష్టపడి సొమ్మును పొదుపు చేసుకుని, సంతోషాలు చంపుకుని బతికేవారు. ఇప్పుడు 'ఉన్నన్ని రోజులు సంతోషంగా బతుకుదాం.. పిల్లలతో, కుటుంబ సభ్యులతో, స్నేహితులతో ఆనందంగా ఉందాం' అనే ధోరణికి వచ్చారు. 'వీకెండ్స్'లో రెస్టారెంట్లు, రిసార్ట్‌లకు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లి 'హ్యాపీ'గా గడుపుతున్నారు. మధ్య తరగతి, ఆపై వర్గాలకు చెందిన వారు హైదరాబాద్, బెంగళూరు, వైజాగ్‌తో పాటు ఉత్తర భారతదేశంలోని ప్రముఖ ప్రాంతాల సందర్శనకు వెళుతున్నారు.

బంధాలు బలపడుతూ.. ఒత్తిడిని దూరం చేస్తూ

రాష్ట్రంలో కర్నూలు నాలుగో అతిపెద్ద నగరం. మెడికల్, ఎడ్యుకేషన్ హబ్‌గా పేరు పొందింది. వ్యాపార కేంద్రం కూడా. వేగవంతమైన జీవన విధానంతో పలువురు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. వివిధ ఆందోళనలతో కుంగుబాటుకు గురవుతున్నారు. వీకెండ్స్‌లో కుటుంబ సభ్యులు, స్నేహితులతో సరదాగా గడుపుతూ పలువురు మానసిక ఒత్తిడిని దూరం చేసుకుంటున్నారు. పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతున్నారు. వారితో ఆటలాడుతూ వారి సంతోషాల్లో భాగమవుతున్నారు. ఇవన్నీ వారికి తీపిగుర్తులుగా ఉంటున్నాయి. ఒక టూర్ వెళ్లొచ్చిన తర్వాత మాటలు, అనుబంధాల్లో చాలా మార్పులు ఉంటున్నాయి. మళ్లీ ఎప్పుడెప్పుడు బయటకు వెళ్లాలా? అని ప్లాన్ చేస్తున్నారు. గతంలో విమానాలు ఆకాశంలో చూసి, అదే పెద్ద ఆనందంగా ఫీలయ్యేవారు! ఇప్పుడు పిల్లలకు అన్నీ చూపించాలి అనే ధోరణిలో కర్నూలు నుంచి వైజాగ్, బెంగళూరు, చెన్నైకి విమానాల్లో వెళుతున్నారు. హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు రయ్యిన ఎగిరిపోతున్నారు. దీంతో ఎయిర్‌ట్రాఫిక్ కూడా భారీగా పెరిగింది. ఇతర ప్రాంతాలకు వెళ్లే పిల్లలకు విషయ అవగాహన పెరుగుతోంది.

పెరిగిన తలసరి ఆదాయం

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో తలసరి ఆదాయం బాగా పెరిగింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వ్యవసాయ ఉత్పత్తులు, పండ్లతోటలు, మైనింగ్‌తో పాటు సేవారంగంలో భారీ అభివృద్ధి జరిగింది. తలసరి ఆదాయంలో 2018–19లో 5.369శాతం నమోదైతే, 2019–20లో 9.44 శాతానికి పెరిగింది. ప్రభుత్వం తీసుకున్న చర్యలే దీనికి కారణం. 2020–21, 2021–22 తలసరి ఆదాయం కూడా 13శాతం పైగా పెరిగింది. త్వరలోనే ప్రణాళిక శాఖ వీటి వివరాలను అధికారికంగా విడుదల చేయనుంది. ప్రజల ఆర్థిక, కొనుగోలు శక్తి పెరగడంతో అవసరాలు తీర్చుకుంటూ ఆనందమయ జీవితాన్ని గడుపుతున్నారు. అలాగే టూరిజం రేటు కూడా కరోనా ముందుతో పోలిస్తే 131 శాతం పెరిగింది. పర్యాటక ప్రాంతాలకు ఏటా 57 శాతం మంది కొత్తగా వెళ్లేవారు ఉంటే, 42 శాతం మంది ఏటా వెళ్లినవారే ఉంటున్నారు. తక్కిన 32 శాతం ఇతర సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఉన్నారు.

మారిన జీవనశైలి

ప్రజల ఆర్థికశక్తి, కొనుగోలు శక్తి మెరుగుపడటంతో జీవనశైలి మారింది. వాహనకొనుగోళ్లు పెరిగాయి. నగరాలు, పట్టణాల్లో షాపింగ్‌మాల్స్, రెస్టారెంట్లు, మల్టీప్లెక్స్‌లు పెరిగాయి. సామాన్య, మధ్యతరగతి వారు కూడా వారంలో కనీసం ఒకటి, రెండురోజులు రెస్టారెంట్లకు వెళుతున్నారు. మంచి ఆహారం, దుస్తులకు ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. సొంత ఇల్లు నిర్మించుకుంటున్నారు. గతంలో సొంత ఊరు వదిలి బయటకు వెళ్లని వారు ఏడాదిలో ఒకటి రెండుసార్లు 'ఫ్యామిలీటూర్ల'కు ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. ఇవన్నీ ప్రజల జీవనవిధానంలో మార్పును సూచిస్తున్నాయి.



ఆనందమే అభి'రుచి'..రిసార్ట్స్‌లో బంధుమిత్రులతో..



ఏమి హాయిలే ఇలా: కుటుంబ సభ్యులతో బోటింగ్



గతంలో డబ్బులు ఖర్చు చేయకుండా దాచుకోవాలి అనిపించేది. ఇప్పుడు మనం సంతోషంగా ఉండేందుకు ఖర్చు చేసి ఆ తర్వాత మిగిలిందే దాచుకోవాలి అనే ధోరణికి వచ్చాం. బయటకు వెళితే పిల్లలు సంతోషంగా ఉంటారు. ఎంత ఖర్చు చేసినా అలాంటి సంతోషం ఉండదు. మేమే కాదు, అందరూ వీకెండ్స్‌లో రెస్టారెంట్లకు, ఏడాదికి 3–4 సార్లు బయటకు వెళుతున్నారు. అన్ని వర్గాల్లో జీవితంపై దృక్పథం మారింది. ఇది మంచిదే! లేదంటే ఒత్తిడితో సతమతమవుతున్నారు. మేమైతే ఇటీవల షిరిడి, కోలాపూర్, పూణె, మహాబళేశ్వరం వెళ్లాం. జిల్లాలో చాలాచోట్లకు వెళుతుంటాం! 'వన్ లైఫ్..బీ హ్యాపీ' అనేలా ఉంటున్నాం.

– పద్మా దివాకర్

తలసరి ఆదాయం పెరుగుదల ఇలా

సంవత్సరం	తలసరి ఆదాయం	పెరుగుదల శాతం
2015 - 16	71,014	7.572
2016 - 17	73,368	3.314
2017 - 18	79,796	8.761
2018 - 19	75,511	5.369 (-)
2019 - 20	82,643	9.44
2020 - 21	—	11.1
2021 - 22	—	12.9

(2020-21, 2021-22 వివరాలు అధికారికంగా రావల్సి ఉంది)

జీవన వేగం పెరిగింది



జీవన వేగం పెరిగింది. కోవిడ్‌లో ఎక్కడికీ వెళ్లలేక బందీలుగా ఉన్నారు. ఇప్పుడు గేట్లు తెరిచినట్లయింది. అందుకే బయటకు వెళుతున్నారు. ఇది మంచిదే. మానసికంగా ఆహ్లాదంగా ఉంటారు. టూర్లకు వెళ్లడం ట్రెండ్ అయ్యింది.

– శివశంకర్‌రెడ్డి, సైక్రియాట్రిస్ట్



మల్లన్న సేవలో సీజేఐ

ఆదివారం శ్రీశైలంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనుంజయ వై.చంద్రచూడ్, కల్పనాదాస్ దంపతులు –శ్రీశైలంటెంపుల్

నేడు నామినేషన్ల విత్‌డ్రాకు ఆఖరు

కర్నూలు(సెంట్రల్): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి వచ్చిన నామినేషన్‌ల విత్ డ్రాకు సోమవారం(27వతేదీ)తో గడువు ముగియనున్నది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ తరఫున బోయ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ ఎ. మధుసూదన్, స్వతంత్ర అభ్యర్థులు ఓర్వకల్లు మండలం గుట్టపాడు సర్పంచ్ ఎస్.మోహన్‌రెడ్డి, ఆళ్లగడ్డ మండలం మోత్కుపల్లి సర్పంచ్ భూమా వెంకట వేణుగోపాల్ రెడ్డి బరిలో ఉన్నారు. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు కనీస బలం లేకున్నా నామినేషన్లు వేశారు. వీరిద్దరూ విత్ డ్రా చేసుకుంటే వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్న డాక్టర్ ఎ.మధుసూధన్ ఏకగ్రీవంగా విజయం సాధిస్తారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఫిబ్రవరి నెల చివరిలోనే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు 33 నుంచి 34 డిగ్రీల వరకు ఉంటాయి. అయితే 39 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఎక్కువగా ఉండే ప్రమాదం ఉందని బనవాసి కేవీకే వాతావరణ శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు. మధ్యాహ్నం 12 తర్వాత ఎండలో బయటికి వెళ్లినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కృష్ణమ్మా.. రావమ్మా!

- గోరుకల్లు రెగ్యులేటర్ విస్తరణ
- 30 వేల క్యూసెక్కుల నీరు వచ్చేలా ప్రణాళిక
- అదనంగా రెండు గేట్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- రూ.28 కోట్లు మంజూరు
- అటవీశాఖ అనుమతులకు ప్రతిపాదనలు



గోరుకల్లు ఇన్‌ఫ్రా రెగ్యులేటర్

పాణ్యం: వరద నీటిని ఒడిసి పట్టి రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తోంది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని గోరుకల్లు రిజర్వాయర్ సీమకు వరదాయినిగా మారింది. ఈ రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసి ఎస్సార్బీసీ, గాలేరు నగరికి నీటి కేటాయింపులు చేశారు. సీమలో 1.92 లక్షల ఎకరాలకు సాగునీరు, 600కుపైగా గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టును రూపొందించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఈ ప్రాజెక్టుకు రూ. 448 కోట్లకు పైగా నిధులు కేటాయించి 80 శాతం పనులు పూర్తి చేశారు. ఆయన మరణాంతరం ప్రభుత్వాలు ప్రాజెక్టును పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ప్రాజెక్టును రెండు సార్లు పరిశీలించారే కానీ పెండింగ్ పనులను పూర్తి చేయలేదు. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగ చేసే క్రమంలో సాగునీటిని సమృద్ధిగా అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బానకచర్ల నుంచి మొదలయ్యే ఎస్సార్బీసీ ప్రధాన కాల్వను విస్తరించి 30 వేల క్యూసెక్కుల కృష్ణానది నీటిని గోరుకల్లుకు తరలించేలా పనులు చేపట్టారు. అయితే రిజర్వాయర్‌కు నీరు చేరే ఇన్‌ఫ్రా రెగ్యులేటర్‌కు ప్రస్తుతం 5 గేట్లు ఉన్నాయి. ఈ గేట్ల ద్వారా 20,196 క్యూసెక్కుల నీరు మాత్రమే రిజర్వాయర్‌లోకి వస్తున్నాయి. పూర్తి స్థాయిలో నీరు వచ్చేలా రెగ్యులేటర్‌ను విస్తరించి అదనంగా మరో రెండు గేట్లను ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.28 కోట్లు మంజూరు చేసింది. ఓ వైపు టెండర్ ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు వెంటనే పనులు చేపట్టేందుకు అటవీ శాఖ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపారు.

సాగుకు సమృద్ధిగా..

గోరుకల్లు రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నింపడంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. గతంలో గాలేరు కాల్వ వైపు గేట్లు లేకపోవడంతో రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ సాధ్యమయ్యేది కాదు. దీంతో ఏటా జనవరి లోపే సాగునీరు అందక ఆయకట్టు రైతులు అవస్థలు పడేవారు. అరకొరగా ఉన్న నీటిని కూడా పొలానికి పారించేందుకు రైతులు కాల్వల వెంట జాగారం చేయాల్సి వచ్చేది. 2020లో గాలేరు కాల్వ వైపు గేట్లు ఏర్పాటు చేయడంతో రైతుల కష్టాలు తొలగిపోయాయి. ఈ ఏడాది 11 టీఎంసీల నిల్వ ఉంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నారు. మార్చి మొదటి వారం వరకు సాగునీరు అందే అవకాశం ఉంది. అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం గోరుకల్లులో 8.02 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పూర్తి స్థాయిలో నింపుతాం

గోరుకల్లు ఇన్‌ఫ్రా రెగ్యులేటర్‌కు అదనంగా 2 గేట్లు నిర్మించేందుకు రూ.28 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. అటవీభూమి అవసరం కావడంతో గ్రామ సభ నిర్వహించి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 12.06 టీఎంసీలు కాగా ఈ సారి పూర్తి స్థాయిలో నింపేందుకు కృషి చేస్తాం.

– శుభకుమార్, ఈఈ



నయనానందకరం

జగద్గురు శ్రీరాఘవేంద్రస్వామి జయంతి ఉత్సవం ఆదివారం రమణీయంగా సాగింది. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మూలబృందావనానికి విశేష పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించి వేడుకలకు అంకురార్పణ పలికారు. పూజమందిరంలో మూలరాముల పూజలు చేపట్టారు. అంతకుముందు గ్రామ దేవత మంచాలమ్మకు పీఠాధిపతి హారతులు పట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈఓ హరినాథ్ పట్టు వస్త్రాలు సమర్పించారు.



– మంత్రాలయం/రూరల్

నమో నారసింహా

- ఎగువ అహోబిలంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం
- సింహ వాహనంపై విహరించిన జ్వాల నరసింహుడు
- దిగువ అహోబిలంలో విశ్వక్సేనారాధన

ఆళ్లగడ్డ: ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో బ్రహ్మోత్సవ సందడి ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఎగువ అహోబిలంలో ధ్వజారోహణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ గరత్మంతుడి చిత్రపటావిష్కరణ చేశారు. అంతకు ముందు ఆలయ ఆవరణలో గరత్మంతుని పల్లకీలో కొలువుంచి ఊరేగిస్తూ ఆలయ ప్రదక్షిణ చేసి ధ్వజస్తంభం వద్దకు తీసుకువచ్చారు. మొదటి జియర్ ఆదివన్ శఠకోపన్ ఉత్సవ విగ్రహం ఎదురుగా ఉంచి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు తరలిరావాలని ఆహ్వానిస్తూ ధ్వజారోహణం చేసి మంత్ర పూర్వకంగా పిలుపునిచ్చారు. రాత్రి సింహ వాహనంపై జ్వాల నరసింహుడు విహరించారు. ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జ్వాల నరసింహుడిని కొలువుంచి పంచామృతాభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించి గ్రామోత్సవం నిర్వహించారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

దిగువ అహోబిలంలో అంకురార్పణ

లోక కల్యాణార్థం.. విశ్వశాంతిని కోరుతూ దిగువ అహోబిలంలో ఆదివారం శ్రీ అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలకు నాంది పలుకుతూ అంకురార్పణ పూజలు చేపట్టారు. అహోబిల మఠం పీఠాదిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విశ్వక్సేనుడి ఆరాధన నిర్వహించారు. పది రోజుల పాటు వైభవంగా సాగే క్రతువుకు ఎటువంటి ఆటంకాలు కలగకూడదని విష్వక్సేనుడిని పూజించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, తలపాగా చుట్టి పూలమాలలు వేసి పల్లకీలో కొలువుంచి ఆలయం బయటకు ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు. తిరుమంజనం, స్వస్తివచనంతో పాటు ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి బ్రహ్మోత్సవాలకు సిద్ధం చేశారు. వైష్ణవ ఆచారంగా రాత్రివేళ వేదమంత్ర పఠనాలతో మృత్యుంగ్రహణం పర్వాన్ని చేపట్టారు. అనంతరం ఈశాన్యంలోని పుట్టమన్ను తెచ్చి నవధాన్యాలను నాటి బ్రహ్మోత్సవాలకు నాంది పలికారు. అనంతరం సెల్వాకూత్తు ఉత్సవం నిర్వహించారు. పండితుల వేదం, రుత్వికుల పారాయణం, పూజారుల మంత్రోచ్చారణ తదితర శాస్త్రోక్త పర్వంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆయా పూజా కార్యక్రమాల్లో ప్రధానార్చకులు వేణుగోపాలన్, జీపీఏ సంపత్, ఈఓ నరసయ్య, మేనేజర్ వైకుంఠం, మణియార్ సౌమ్యానారాయణ్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



దిగువ అహోబిలంలో విశ్వక్సేనుడిని యాగశాలకు తోడ్కొని వస్తున్న పీఠాధిపతి, వేదపండితులు



ఎగువలో పల్లకీ విహరిస్తున్న జ్వాల నరసింహుడు

నేడు అహోబిలంలో..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున దిగువ అహోబిలంలో ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుంది. అనంతరం భేరీ పూజ, రాత్రి సింహ వాహన సేవలు కొనసాగుతాయి. ఎగువ అహోబిలంలో సోమవారం ఉదయం సూర్య ప్రభ వాహనం, సాయంత్రం హంస వాహన సేవ నిర్వహిస్తారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● నెల రోజుల వ్యవధిలోనే తండ్రీ కొడుకు మృతి


మృతి చెందిన యువకుడు కిషోర్

కొలిమిగుండ్ల: తండ్రి మృతి చెందిన నెల రోజుల వ్యవధిలోనే కుమారుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఆదివారం కొలిమిగుండ్లలో జరిగిన ఈ ఘటన బాధిత కుటుంబంలో తీరని విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. అవుకు మండలం కునుకుంట్లకు చెందిన శ్రీనివాసులు, శశికళ దంపతులకు కుమారుడు , కుమార్తె సంతానం. కుమారుడు కిషోర్ (20 కర్నూలులో బీటెక్ మొదటి సంవత్సరం అభ్యసిస్తున్నాడు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో స్నేహితుడు ప్రమాదంలో గాయపడ్డాడని చూసి వస్తానని ఇంట్లో చెప్పి ఇతరుల బైక్ తీసుకొని బయలు దేరాడు. మార్గమధ్యంలో కొలిమిగుండ్ల కస్తూర్బా పాఠశాల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. 20 రోజుల క్రితమే ఈ యువకుడి తండ్రి శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందాడు. ఇప్పుడు కుమారుడిని కూడా కోల్పోవడంతో శశికళ ప్రమాద స్థలానికి చేరుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

డీఎంజీఓగా మారనున్న మైనింగ్ డీడీ కార్యాలయం

కర్నూలు(రాజ్‌విహార్): గనులు, భూగర్భ శాఖ కర్నూలు డిప్యూటీ డైరెక్టర్ (ఉప సంచాలకులు) కార్యాలయ పేరు మారనుంది. జిల్లా మైనింగ్ అండ్ జియోలజీ కార్యాలయంగా మార్పులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాల పునర్విభజన తరువాత పలు శాఖల అధికారులు హోదాలు, కార్యాలయాల పేర్లను మార్పులు చేసిన ప్రభుత్వం తాజాగా మైనింగ్ శాఖ కార్యాలయాన్ని మార్పులు చేస్తోంది. దీనిని ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ వెల్లడించారు.

అడవి తల్లికి స్వచ్ఛ హారం

- ప్లాస్టిక్ ఫ్రీ నల్లమలకు ప్రత్యేక చర్యలు
- స్వచ్ఛ సేవకులతో నిత్యం ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ
- యాత్రికులు, వాహనదారుల్లో అవగాహనకు అటవీ శాఖ కృషి


సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ మహమ్మారి నుంచి అడవి తల్లిని రక్షించేందుకు అటవీ శాఖ అధికారులు చేపట్టిన ప్రయత్నం ఫలిస్తోంది. ఓ వైపు పర్యావరణాన్ని కాపాడుతూ.. మరో వైపు అటవీ జంతువుల ప్రాణాలను రక్షిస్తూ నల్లమలకు స్వచ్ఛ హారం వేస్తున్నారు. రిజర్వ్ అటవీ ప్రాంతంలో రహదారుల వెంబడి, పుణ్యక్షేత్రాలు, టూరిస్ట్ పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంతో నల్లమల ప్లాస్టిక్ ఫ్రీగా మారుతోంది.

ఆళ్లగడ్డ: నంద్యాల జిల్లాలో విస్తరించిన నల్లమల అభయారణ్యం అరుదైన వృక్ష, జంతు సంపదకు నిలయం. వాటి ఉనికికి ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్ వ్యర్థాలను వేరిపేసేందుకు అటవీ శాఖ చేపట్టిన 'స్వచ్ఛ నల్లమల' కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోంది. అటవీ సమీప ప్రాంతాల ప్రజలు, రహదారుల మీదుగా ప్రయాణించే యాత్రికులు, భక్తులు విసిరే వస్తువుల వల్ల అడవిలో ప్లాస్టిక్, చెత్తా చెదారం పేరుకుపోతోంది. ఇలా పోగుపడిన చెత్త అడవికి, అందులోని వన్యప్రాణులకు తీవ్ర ముప్పుగా మారుతుంది. చాలా చోట్ల అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిని నివారించేందుకు అటవీ శాఖ నల్లమల రిజర్వ్ ఫారెస్ట్‌లో పచ్చర్ల, బైర్లూటీ రేంజ్ పరిధిలో 2019 నుంచి చెత్త సేకరణ చేస్తున్నారు. నంద్యాల, గిద్దలూరు రహదారిలో సర్వనరసింహ స్వామి క్షేత్రం నుంచి ప్రకాశం జిల్లా సరిహద్దు వరకు సుమారు 15 కి.మీ మేర, అలాగే ఆత్మకూరు – దోర్నాల రహదారిలో బైర్లూటీ నుంచి ప్రకాశం జిల్లా సరిహద్దు వరకు దాదాపు 20 కి.మీ వరకు చెత్తను సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు ఆరు టన్నుల చెత్తను సేకరించి రీసైక్లింగ్‌కు పంపారు. అలాగే నవ నారసింహ క్షేత్రాలు కొలువైన అహోబిలం పరిధిలో కూడా గ్రామస్తులు, దేవస్థానం అధికారులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

వన్యప్రాణులకు ముప్పు

నల్లమల అటవీ పరిధిలో శ్రీశైలం, మహానంది, అహోబిలం, సర్వ నరసింహ స్వామి క్షేత్రాలతో పాటు ప్రకాశం – నంద్యాల జిల్లా మధ్య రాకపోకలకు రెండు ప్రధాన రహదారులు ఉన్నాయి. క్షేత్రాల సందర్శనకు వచ్చే భక్తులు, రహదారుల మీదుగా వెళ్లే వాహనదారుల్లో కొందరు బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తించి ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లు, సిగరేట్ పెట్టెలు, మద్యం బాటిళ్లు రోడ్ల వెంబడి పడేస్తున్నారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను వన్యప్రాణులు తింటూ అనారోగ్యం బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. కొన్ని సార్లు వాటిని తినేందుకు రహదారులపైకి వచ్చి ప్రమాదానికి గురవుతున్నాయి. వీటికి అలవాటు పడిన చిన్నచిన్న వన్యప్రాణులు రోడ్ల వెంట తిరుగుతూ అడవిలోకి వెళ్లకుండా ఉంటుండటంతో వాటి ఆహారపు అలవాట్లలోనూ మార్పు వస్తోంది.

సమష్టిగా అవగాహన సదస్సులు

అడవి సమీపంలోని గ్రామాల ప్రజలకు, వ్యాపారస్తులకు, దేవస్థానాల నిర్వాహకులకు అటవీ శాఖ స్వచ్ఛ నల్లమలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. రిజర్వ్ ఫారెస్ట్‌లో రహదారి వెంట, దేవస్థానాల పరిధిలో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయిస్తోంది. యాత్రికులు, భక్తులు ప్లాస్టిక్ వ్యర్థాలను అందులో వేసేలా సూచిక బోర్డులు పెట్టిస్తోంది. ప్లాస్టిక్ వల్ల జరుగుతున్న నష్టాలను తెలిపేలా పెద్దపెద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేయిస్తోంది. స్థానిక పోలీసులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పిస్తోంది.


ఎగువ అహోబిలం క్షేత్ర సమీపంలోని రిజర్వు ఫారెస్ట్‌లో వ్యర్థాలను సేకరిస్తున్న అహోబిలం దేవస్థాన సేవకులు

చెంచులకు ఉపాధి..

పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి 'మన ఎన్ఎస్‌టీఆర్– క్లీన్ అండ్ గ్రీన్ ఎన్ఎస్‌టీఆర్' పేరుతో వినూత్న కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఓ వైపు ప్రజలను చైతన్య వంతం చేస్తూనే.. వ్యర్థాల సేకరణకు స్థానికంగా ఉండే చెంచు యువతను స్వచ్ఛ సేవకులుగా నియమిస్తున్నారు. ప్రతి స్వచ్ఛసేవక్ అడవిలో జనసంచారం ఉండేచోట కొంత ప్రాంతాన్ని కేటాయించి ఆ పరధిలో రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ప్రామాణిక పద్ధతుల్లో రీసైక్లింగ్ చేసే బాధ్యత అప్పగించారు. అలాగే జాతీయ రహదారుల వెంబడి వెళ్లే పెద్ద వాహనాలకు (లారీ, బస్సులు) రూ.100, చిన్న వాహనాల (కారు, జీపు)కు రూ. 50 అటవీ శాఖ వసూలు చేస్తోంది. ఇలా వచ్చిన ఆదాయం ద్వారా స్వచ్ఛ సేవకులకు వేతనాలు అందజేస్తున్నారు.


పచ్చర్ల సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న అటవీ స్వచ్ఛ సేవకులు

జీవనోపాధి లభించింది



సర్వనరసింహస్వామి ఆలయం నుంచి ప్రకాశం జిల్లా బార్డర్ వరకు సుమారు 15 కిలో మీటర్లు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నాం. అటవీ శాఖ ఆధ్వర్యంలో నియమించిన 13 మంది స్వచ్ఛసేవకులతో పాటు పర్యవేక్షణకు 8 మంది ప్రొటెక్షన్ వాచర్లు ఉన్నారు. అందరం కలసి నల్లమలలోని రోడ్డు వెంట నెలకు సుమారు 100 కిలోల మేర వ్యర్థాలను సేకరిస్తున్నాం. వీటిని హైదరాబాద్‌కు చెందిన రీసైక్లింగ్ కంపెనీకి కిలో వాటర్ బాటిళ్లు రూ. 15, ప్లాస్టిక్ పేపర్లు రూ. 5 చొప్పున విక్రయిస్తున్నాం.

– చెంచు లోకేష్, స్వచ్ఛ సేవకుడు, పచ్చర్ల రేంజ్

అడవులను కాపాడుకోవాలి



పర్యావరణ పరిరక్షణకు అడవులు ఎంతో కీలకం. అడవులను సంరక్షించే బాధ్యత అందరిది. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా కృషి చేయాలి. అడవిలో ప్రయాణించే సమయంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పారేయకుండా జాగ్రత్తగా ఉండాలి. వన్యప్రాణులు అంతరిస్తే జీవ వైవిధ్యం దెబ్బతిని మానవాళికి ముప్పు వాటిల్లుతుంది.

– శ్రీనివాసరెడ్డి, మాజీ సైనికుడు

అవగాహన అవసరం



ప్లాస్టిక్ ఫ్రీ నల్లమలగా మార్చేందుకు చర్యలు చేపట్టాం. ప్రజల్లో అవగాహన పెరగాలి. యాత్రికులు, ప్రయాణికులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వెంట తీసుకెళ్లరాదు. ప్లాస్టిక్ వ్యర్థాలను తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లలో పారేయాలి. నల్లమల రహదారుల వెంబడి స్వచ్ఛ సేవకులు రోజూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నారు.

– వినీత్‌కుమార్, జిల్లా అటవీ అధికారి

'ఈనాడు'ను బహిష్కరించండి

● కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్


ఈనాడు ప్రతులు దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చడమే లక్ష్యంగా తప్పుడు వార్తలు రాస్తున్న ఈనాడు దినపత్రికను ప్రజలందరూ బహిష్కరించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలులోని ఎస్‌బీఐ సర్కిల్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనాడు ప్రతులను దహనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనపై ప్రజల్లో రోజురోజుకు మద్దతు పెరుగుతోందన్నారు. ఇది ఓర్వలేక ఈనాడు యజమాని రామోజీరావు ప్రభుత్వంపై, వైఎస్సార్‌సీపీపై విషం చిమ్మే కథనాలు రాస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం కర్నూలు జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్, పార్టీ రాష్ట్ర నాయకులు సీహెచ్ మద్దయ్య, ధనుంజయ ఆచారి, సేవాదల్ నాయకులు కేదార్‌నాథ్, న్యాయవాదులు సంపత్‌కుమారి, సాతర్ల రాజేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు పాస్‌పోర్టు తప్పనిసరి

- మార్చి 10 వరకు దరఖాస్తుల స్వీకరణ
- సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత సేవలు


హాఫిజ్ మంజూర్ అహ్మద్

కర్నూలు(రాజ్‌విహార్): హజ్‌కు వెళ్లే యాత్రికులు తప్పనిసరిగా పాస్‌పోర్టు కలిగి ఉండాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హాఫిజ్ మంజూర్ అహ్మద్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 హజ్ మార్గదర్శకాల మేరకు దరఖాస్తుతో పాటు పాస్‌పోర్టు మొదటి, చివరి పేజీల కలర్ జిరాక్స్ కాపీని జత చేయాలని సూచించారు. పాస్‌పోర్టు గడువు 2024 ఫిబ్రవరి 3 వరకు ఉండాలని, దీనితో పాటు జాతీయ బ్యాంక్ ఖాతా పాస్ బుక్ కలర్ జిరాక్స్/ క్యాన్సిల్డ్ చెక్కు కాపీని సమర్పించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు మెడికల్ స్క్రీనింగ్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, కోవిడ్–19 వ్యాక్సిన్స్ వేసుకున్న సర్టిఫికెట్లు జత చేయాలని చెప్పారు. తెల్ల బ్యాక్‌గ్రౌండ్‌తో 3.5''3.5 సైజులో రెండు కలర్ ఫోటోలు సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యాక లాటరీ ద్వారా ఎంపిక ఉంటుందని, 2023 ఏప్రిల్ 30 లోపు 70 ఏళ్ల పూర్తయ్యే వారికి డిప్ పద్ధతి కాకుండా నేరుగా ఎంపిక చేయడంతో పాటు వారి వెంట మరొకరికి అవకాశం ఉంటుందన్నారు. ఎంపికైన వారు తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలన్నారు. హజ్ దరఖాస్తు పత్రాలు కర్నూలు బుధవారపేటలోని మహబూబ్ సుబహాని మసీదులో ఉన్న రాయలసీమ హజ్ సొసైటీ కార్యాలయంలో, పెద్ద మార్కెట్ సమీపంలోని అబుబక్కర్ మసీదులో ఉన్న జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో ఉచితంగా పొందవచ్చన్నారు. మార్చి 10 లోపు వాటిని సమర్పించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు తన సెల్: 94402 32564, మహమ్మద్ పాషా 99085 45232, ఎం. బాషా సాబ్ 99633 18255, అశ్ఫక్ హుసేన్ 98662 86786 నంబర్లకు సంప్రదించాలన్నారు.

వాల్మీకుల్లో ప్రాంతీయ వ్యత్యాసం తొలగించాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో వాల్మీకి నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న వాల్మీకి నేతలు

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని వాల్మీకుల్లో ఉన్న ప్రాంతీయ వ్యత్యాసాన్ని తొలగించి ఎస్టీలుగా గుర్తించాలని వాల్మీకి నేతలు కోరారు. ఆదివారం స్థానిక మౌర్యాఇన్ సమావేశ భవనంలో ఏపీ బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె. శ్రీనివాసులునాయుడు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐక్య వాల్మీకి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి. లక్ష్మన్న, జగ్గాపురం ఈరన్న, బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు, వాల్మీకి సేవా సంస్థ నాయకులు కుబేరస్వామి, అఖిల భారత వాల్మీకి సంఘం అధ్యక్షుడు మద్దులేటి, వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థానం చైర్మన్ బేతం కృష్ణుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ సమావేశాల్లో వాల్మీకుల ఎస్టీ బిల్లుపై తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. అలాగే వాల్మీకి కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకుల ఆర్థిక స్థితిగతుల్లో మార్పు తీసుకురావాలన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో వాల్మీకి స్మృతివనం ఏర్పాటు చేసేందుకు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలన్నారు. ఎస్టీ సాధనే ధ్యేయంగా తమ తమ ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకొని భవిష్యత్ కార్యక్రమాలకు సిద్ధం కావాలని వాల్మీకులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు కమ్మారు నాగరాజు, వినోద్‌కుమార్, శ్రీను, తలారి కృష్ణ, బోయ రంగముని, జ్ఞానేశ్వరమ్మ తదితరులు హాజరయ్యారు.

అలా కొట్టేశారు.. ఇలా పట్టేశారు


బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్


అందజేసిన సెల్‌ఫోన్లతో బాధితులు

- చోరీకి గురైన రూ.5.5 కోట్ల విలువైన 1,924 సెల్‌ఫోన్ల రికవరీ
- ఆనందం వ్యక్తం చేసిన బాధితులు

కర్నూలు: రకరకాల కారణాలతో చోరీకి గురైన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీలో జిల్లా పోలీసులు సత్తా చాటుతున్నారు. లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ అప్లికేషన్ ద్వారా బాధితుడు ఇచ్చిన ఓ చిన్న ఫిర్యాదుతో పోయిన సెల్‌ఫోన్ ఇతర రాష్ట్రాలు, జిల్లాలు ఎక్కడున్నా పట్టేస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ. 6.5 కోట్ల విలువ చేసే 3,803 సెల్‌ఫోన్లు రికవరీ చేయగా తాజాగా నాలుగో విడతలో రూ. 5.5 కోట్లు విలువ చేసే 1,924 ఫోన్లు రికవరీ చేశారు. ఆదివారం బాధితులను జిల్లా పోలీసు పరేడ్ మైదానానికి పిలిపించి ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ చేతుల మీదుగా అందజేశారు. ఫోన్ పోగొట్టుకున్న వారిలో పలువురు వ్యాపారులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థులు, న్యాయవాదులు, మహిళలు ఉన్నారు. నెలరోజుల వ్యవధిలోనే తిరిగి వారి ఫోన్ చేతికందడంతో ఆనందం వ్యక్తం చేస్తూ ఎస్పీతో పాటు, జిల్లా పోలీసులు ఐటీకోర్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సెల్ ట్రాకింగ్ సభ్యులకు మిఠాయిలు పంపిణీ చేశారు

రికవరీలో కర్నూలు అగ్రగామి

సెల్‌పోగొట్టుకున్న వారు తిరిగి పొందేందుకు పడుతున్న ఇబ్బందులను గుర్తించి 5 మాసాల క్రితం ఈ–మొబైల్ ట్రాకింగ్ వెబ్‌సైట్‌ను రూపొందించారు. సెల్ చోరీకి గురైన వారు ఫిర్యాదు చేయగానే పోలీసులు ట్రాకింగ్ చేసి ఫోన్ ఎక్కడుందో పట్టేస్తున్నారు.ఈ ఐదు నెలల వ్యవధిలోనే రూ.12 కోట్ల విలువ చేసే 5,727 సెల్‌ఫోన్లు రాబట్టి వాటిని బాధితులకు అందజేయడం ద్వారా రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా సెల్‌ఫోన్ రికవరీలో అగ్రగామిగా నిలిచింది.

మొబైల్ పోగొట్టుకుంటే...

ఎవరైనా మొబైల్ పోగొట్టుకుంటే లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ లింక్‌లో www.kurnoolpolice.in మొబైల్ థెఫ్ట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి లింక్ ఓపెన్ చేసి ఫిర్యాదు ఫారం నింపాలి. పేరు, జిల్లా, పోలీసు స్టేషన్ పరిధి, మొబైల్‌కి సంబంధించిన ఐఎంఈఐ–1, ఐఎంఈఐ–2 నంబర్లతో పాటు, బిల్లులు, ఆన్‌లైన్‌లో సమాచారం పొందుపరిస్తే సాంకేతికత ఆధారంగా ట్రాక్ చేసి ఎక్కడ ఉందో గుర్తిస్తారు.

ఆనందంగా ఉంది



కర్నూలు శ్రీచైతన్య కాలేజీలో ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. మూడు నెలల క్రితం రూ.87 వేలు విలువ చేసే ట్యాబ్ పోయింది. దీని వల్ల చదువు కూడా ఇబ్బందిగా ఉండేది. సోషల్ మీడియాలో చూసి ఫిర్యాదు చేశాను. ట్యాబ్‌ను రికవరీ చేసి తిరిగి పోలీసులు నాకు అప్పగించడం ఆనందంగా ఉంది. కర్నూలు పోలీసుల సేవలు భేష్.

– అశ్వంత్‌రెడ్డి, నంద్యాల

సోషల్ మీడియాలో చూసి ఫిర్యాదు



తిరుమల దేవాలయంలో నెల రోజుల క్రితం నా మొబైల్ పోయింది. సోషల్ మీడియాలో చూసి కర్నూలు పోలీసు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేశాను. నెల రోజుల్లో మొబైల్ రికవరీ చేయడం ఆనందంగా ఉంది. జిల్లా పోలీసులకు ధన్యవాదాలు.

– రామ్ నిటోమర్, ఉత్తరప్రదేశ్

రికవరీ అవుతుందనుకోలేదు



నేను హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నాను. సంక్రాంతి పండుగకు అమ్మ వాళ్ల ఊరుకి వెళ్తుంటే సెల్‌ఫోన్ పోయింది. అందులో కంపెనీ డేటా ఉంది. ఇక ఫోన్ దొరకదు అనుకున్నా. మొబైల్ రికవరీ మేళా గురించి తెలుసుకుని కర్నూలు పోలీసు వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశా. నెలరోజుల్లోనే రికవరీ కావడంతో సంతోషంగా ఉంది.

– లాహరి, హైదరాబాదు